నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | మే 03, 2024 | www.navatelangana.com

సక్కును గెలిపించాలని ప్రచారం

నవతెలంగాణ-తలమడుగు



బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును అత్యధిక మెజారిటీతో గెలిపించాలంటూ గురువారం మండలంలోని పలు గ్రామాలలో మండల నాయకులు ప్రచారం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు అమలు చేసిన పలు అభివృద్ధి పథకాలతో పాటు సంక్షేమాన్ని వివరిస్తూ ప్రచారం కొనసాగించారు. కాంగ్రెస్, బీజెపి మాటలకు మోసపోవద్దని ఓటర్లను కోరారు. ప్రచారంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, నాయకులు పిడుగు అభిరామిరెడ్డి, ఆశన్న యాదవ్, పెందూర్ మాధవరావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

నవతెలంగాణ-ఉట్నూర్



మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు గురువారం పార్టీకి రాజీనామా చేశారు. పార్టీలో సరైన గుర్తింపు లేకపోవడంతో రాజీనామా చేస్తున్నామని తెలిపారు. రాజీనామా చేసిన వారిలో మండల అధ్యక్షుడు కందుకూరి రమేష్, వైస్ ఎంపిపి బాలాజీ, మహిళా నాయకురాలు రాథోడ్ సుమన్‌బాయి, లింగోజీతండా మాజీ సర్పంచ్ హరినాయక్, మాజీ జడ్పీటీసీ జగ్జీవన్‌రావు ఉన్నారు.

అభివృద్ధికి భరోసా..విజయంపై ధీమా..!

- హస్తంలో ఉత్సాహం నింపిన సీఎం పర్యటన
- ఉమ్మడి జిల్లా అంటే ప్రత్యేక అభిమానమని వ్యాఖ్య
- ఆత్రం సుగుణను లోక్‌సభకు పంపించాలని రేవంత్ పిలుపు
- ఆసిఫాబాద్ జన జాతర సభకు భారీగా హాజరైన జనం



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన అభ్యర్థి ఆత్రం సుగుణ



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

నవతెలంగాణ- ఆసిఫాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆసిఫాబాద్ జిల్లా పర్యటన కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటే ప్రత్యేక అభిమానం ఉందని సీఎం పేర్కొనడంతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వివిధ సమస్యలు ప్రస్తావించడం.. వాటన్నింటినీ పరిష్కరిస్తామని సీఎం భరోసానివ్వడంతో ఆ పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. గత పదేండ్ల బీఆర్ఎస్, బీజేపీ పాలనలో ఉమ్మడి జిల్లాకు ఒరిగిందేమీ లేదని.. ఆ పార్టీల పాలనలో జరిగిన అన్యాయాన్ని కాంగ్రెస్ సరిచేస్తుందని భరోసా ఇవ్వడంతో సభికుల్లో ఉత్సాహం వెల్లువిరిసింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన సీఎం స్థానికంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. మంత్రి సీతక్క, కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలిసి మాట్లాడారు. గతంలో ఎన్నడూలేని విధంగా తొలిసారి కాంగ్రెస్ పార్టీ ఆడబిడ్డకు టికెట్ కేటాయించిందని గెలిపించుకోవాల్సిన బాధ్యత జిల్లా ప్రజలపై ఉందని వ్యాఖ్యానించారు.

సమస్యల పరిష్కారంపై భరోసా

గత పదేండ్ల బీఆర్ఎస్,బీజేపీ పాలనలో ఉమ్మడి జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని..తుమ్మిడి హేటీ వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపట్టలేదని, సీసీఐ పరిశ్రమ, కుమురంభీం ప్రాజెక్టుకు కాల్వల నిర్మాణం చేపట్టలేదని.. గుండి వంతెన పూర్తిచేయలేదని సీఎం ప్రస్తావించారు. కాంగ్రెస్‌ను గెలిపించగానే ఆయా సమస్యలన్నింటినీ పరిష్కరించడంతో పాటు విద్యాలయాలు, ప్రాజెక్టులు, రోడ్లు,వంతెనలన్నింటినీ అందుబాటులోకి తీసుకొస్తామని భరోసా ఇచ్చారు. మరోపక్క ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తనకు ప్రత్యేక అభిమానం ఉందని టీపీసీసీ అధ్యక్షుడిగా తొలి కార్యక్రమాన్ని ఇక్కడ్నుంచే ప్రారంభించానని గుర్తుచేశారు. ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు నిధులు కేటాయించానని..1981లో మరణించిన అమరువీరుల కుటుంబాలకు ఇండ్ల పట్టాలతో పాటు నిర్మానానికి రూ.5లక్షల చొప్పున కేటాయించానని పేర్కొన్నారు. సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావుకు బీజేపీ టికెట్ ఇవ్వకుండా అవమానించిందని.. ప్రస్తుత బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ ఓ దొరలా వ్యవహరిస్తారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ అభ్యర్థి సక్కు గురించి చెప్పాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ నుంచి గెలిచిన ఆయన ప్రస్తుతం ఏ పరిస్థితిలో ఉన్నారో అందరికీ తెలుసని పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆత్రం సుగుణ చదువుకున్న వ్యక్తి అని..సమస్యల పట్ల పూర్తిగా అవగాహన ఉందని, తెగింపు పోరాడే సత్తా ఉందని గెలిపించుకోవాల్సిన బాధ్యత జిల్లా ప్రజలపై ఉందని తెలిపారు.

కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం..!

ఆసిఫాబాద్‌లో నిర్వహించిన సభకు ముఖ్యమంత్రి హాజరుకావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. ఇది వరకే ఆదిలాబాద్‌లో నిర్వహించిన సభకు హాజరైన సీఎం మరోసారి ఆసిఫాబాద్ రావడం పట్ల ఆ పార్టీ శ్రేణులు విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీల తీరుపై విమర్శనస్త్రాలు సంధించిన సందర్భంలో ఆ పార్టీ శ్రేణులు, ప్రజలు చప్పట్లు కొడుతూ ఉత్సాహాన్ని కనబర్చారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో పెండింగ్ సమస్యలను ప్రస్తావించడం.. వాటి పరిష్కారానికి భరోసానివ్వడంతో ఆ పార్టీ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. సభకు జిల్లా నలుమూలల నుంచి భారీగా జనం హాజరుకావడంతో సభా ప్రాంగణం జనసంద్రంగా మారింది. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీస్, ఆదిలాబాద్, సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు కంది శ్రీనివాస్‌రెడ్డి, రావి శ్రీనివాస్, శ్యాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

బీజేపీ దోపిడిదారుల పార్టీ : మంత్రి సీతక్క

బీజేపీ దోపిడీదారుల పార్టీ. మనం స్వేచ్ఛగా బతుకుతున్నామంటే దానికి కాంగ్రెస్సే కారణం. రాజ్యాంగం కావాలంటే కాంగ్రెస్‌కు ఓటేయాలి. కేసీఆర్ ఇంకా అధికారంలో ఉన్నామనే భ్రమలో బతుకుతున్నారు. ఉమ్మడి జిల్లాలో నెలకొన్న పోడుభూములు, రోడ్లు, ప్రాజెక్టులు తదితర అన్ని సమస్యలను పరిష్కరిస్తాం.

ఎంపీ అభ్యర్థులకు చిత్తశుద్ధి లేదు : వెడ్మ బొజ్జు, ఖానాపూర్ ఎమ్మెల్యే

ప్రస్తుతం బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులుగా బరిలో ఉన్న వారికి సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధి లేదు. నగేష్ మంత్రిగా, ఎంపీగా పనిచేసినా జిల్లాకు చేసిందేమీలేదు. కాంగ్రెస్ హామీలన్నింటినీ తప్పకుండా నెరవేరుస్తుంది. రుణమాఫీ, రైతుబంధు అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నాం.

ఒక్క అవకాశం కల్పించండి : ఆత్రం సుగుణ, ఎంపీ అభ్యర్థి

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తనకు ఒక అవకాశం ఇవ్వండి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సబ్బండ వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుంది. ముఖ్యమంత్రికి ఆదిలాబాద్ జిల్లాపై ప్రత్యేక అభిమానం ఉంది. అందుకే ఇప్పటికే మూడుసార్లు వచ్చారు. జిల్లా అభివృద్ధికి శయశక్తులా కృషిచేస్తా.

నేడు సీపీఐ(ఎం) పార్లమెంట్ స్థాయి సమావేశం

- జయప్రదం చేయాలని పిలుపు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీపీఐ(ఎం) పార్లమెంట్ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం యాదవ సంఘ భవనంలో ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ తెలిపారు. గురువారం పట్టణంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కానున్నారని తెలిపారు. పార్టీ రాష్ట్ర నాయకులు జె.వెంకటేష్ అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించే లక్ష్యంతో జరుగుతున్న ఈ సమావేశానికి పార్టీ సభ్యులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు తొడసం భీంరావు, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యురాలు ఆర్.మంజుల, నాయకులు లింగాల చిన్నన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే మరింత అభివృద్ధి



నవతెలంగాణ-తాంసి

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించుకుంటే మరింత అభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ మండల కన్వీనర్ నారాయణ అన్నారు. గురువారం హస్నాపూర్, వడ్డాడి గ్రామాలలో మండల నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను, పార్లమెంట్ ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేసిన నుండి ఆరు గ్యారంటీలను అమలు చేయడం జరుగుతోందన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ ఆగస్ట్ వరకు పూర్తి చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి చేతి గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, లింగారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, హన్మండ్లు, రామన్నయాదవ్, గంగారెడ్డి, గంగన్న పాల్గొన్నారు.

జిల్లాకు ఏమీ చేయని బీజేపీని ఓడించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

జిల్లాకు ఏమీ చేయని బీజేపీని ఓడించాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని మండలం కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ ఆధ్వర్యంలో ఉట్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ మండలాల బూత్ స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అంకితభావంతో పనిచేస్తే గెలుపు తమదేనని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను ప్రజలకు వివరించి తమకు అనుకూలంగా మలుచుకోవాలని, కేసీఆర్ సర్కారు చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. పార్టీ మారిన నాయకులకు ఎన్నికల్లో మన తఢాఖా చూపించాలని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు భయపడి 48గంటలు ప్రచారానికి నిషేధం విధించారన్నారు. బీఆర్ఎస్ నుండి ఇంద్రకరణ్‌రెడ్డి, విఠల్‌రెడ్డి పోయినా భారీగా ఓట్లు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, నియోజకవర్గ ఇన్‌చార్జి బుక్యా జాన్సన్ నాయక్, నియోజకవర్గంలోని ఎంపీపీలు, జడ్పీటీసీలు, సింగిల్ విండో చైర్మన్లు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఎంపీటీసీలు, మండలాల పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలీసెట్ ఆలస్య రుసుము గడువు పొడిగింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలతో పాటుగా, వ్యవసాయ, వెటర్నరీ, హార్టికల్చర్, ఫిషరీస్ డిప్లమోలలో ప్రవేశం కోసం నిర్వహించే పాలిటెక్నిక్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష పాలీసెట్-2024కు ఆన్‌లైన్‌లో ఆలస్య రుసుం రూ.100తో దరఖాస్తు చివరి తేదీని ఈ నెల 7వరకు పొడిగించినట్లు ఆదిలాబాద్ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.300తో మే 20వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, మే 24న పాలీసెట్ ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పదవ తరగతి సిలబస్ ఆధారంగా రెండున్నర గంటల పాటు నిర్వహించే పాలీసెట్ ప్రశ్నపత్రంలో గణితం, భౌతిక, రసాయన, జీవశాస్త్రంలో మొత్తం 150 మార్కుల ప్రశ్నలు తెలుగు, ఆంగ్లంలో ఉంటాయని పేర్కొన్నారు. సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ మూడు సంవత్సరాల డిప్లొమో కోర్సులలో 60 సీట్లు చొప్పున ఉన్నాయన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-బేల

మండలంలోని చాంద్‌పెల్లి, మారుతిగూడ గ్రామాలలో పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణకు మద్దతుగా గడపగడపకు వెళ్లి ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఫైజుల్లాఖాన్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఆదివాసుల అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు రుణమాఫీ గురించి మాట్లాడుతున్నారని, గత ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతమందికి రుణమాఫీ చేశారో ఆత్మవిమర్శ చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రచారంలో నాయకులు విలాస్ సావాపురే, చాంద్‌పెల్లి మాజీ సర్పంచ్ కోరంగే జంగ్‌శావ్, ప్రశాంత్ రెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

హస్నాపూర్‌లో..

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ఆరు గ్యారెంటీల అమలు సాధ్యమవుతుందని యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సదల్‌పూర్ గ్రామ పంచాయతీలోని హస్నాపూర్ గ్రామంలో ఆత్రం సుగుణక్కను గెలిపించాలని ఇంటింటికి వెళ్లి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణ గెలుపు కోసం ఆదివాసి ప్రజలతో పాటు అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా 13న జరిగే ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ కేంద్రంలోనూ అధికారంలోకి వస్తే అనేక ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల ఎస్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్ బాపురావు, విశాల్, మంగేష్, సాయి పాల్గొన్నారు.



మండలాధ్యక్షుడు ఫైజుల్లాఖాన్ ఆధ్వర్యంలో ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న సామ రూపేష్‌రెడ్డి, నాయకులు

ఓటు హక్కుపై పలు భాషల్లో ప్రచారం



నవతెలంగాణ-తలమడుగు

ఈ నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని పలు భాషల్లో గురువారం ప్రచారం చేపట్టారు. తహసీల్దార్ రాజ్‌మోహన్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్, కలెక్టర్ ఆదేశానుసారం మండలంలోని సుంకిడి, తలమడుగు, భరంపూర్, కుచులాపూర్, కజ్జర్ల, దేవాపూర్, లింగి, పల్సి(కె) పల్సి(బి) తదితర గ్రామాల్లో మరాఠీ, హిందీ, గోండి, తెలుగు భాషల్లో ఓటు హక్కు వినియోగంపై ప్రచారం నిర్వహించారు. మండలం మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఉండడంతో మండలంలో గిరిజన గ్రామాలు అధికంగా ఉండడంతో వారికి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించామని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ సూచించారు. మండలంలో 27,650 మంది ఓటర్లకు 43 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున ఎన్నికల కమిషన్ సాయంత్రం 6 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ వినోద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సక్కు గెలుపుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పార్టీ గెలుపుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని, అండగా ఉంటూ దిశానిర్దేశం చేస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. గురువారం పట్టణ శివారులోని ఓ ఫంక్షన్ హాలులో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి పార్లమెంట్ ఎన్నికల్లో ఎలా వ్యహరించాలో వివరించారు. ఇందులో ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు పాల్గొని కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన తప్పును సరి చేసుకుంటూ పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఎన్నికలకు పది రోజుల ముందు చాలా కీలకమైమని తెలిపారు. ఈ పది రోజులు ప్రణాళిక ప్రకారం పని చేస్తే ఎవరు కూడా తమను ఓడించలేరని స్పష్టం చేశారు. తాను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినా పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపుకు పూర్తి సహకారం అందిస్తానన్నారు. కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికెళ్లి తాము చేసిన అభివృద్ధిని వివరించాలన్నారు. అదే సందర్భంగా ఇతర పార్టీలు చేసిన మోసాలను తెలియజేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, లింగారెడ్డి, రోకండ్ల రమేష్, విజ్జగిరి నారాయణ, రమేష్‌రెడ్డి, జోగు మహేందర్, విజయ్, పెందూరి దేవన్న, ఊశన్న, పరమేశ్వర్, మహిళా సంఘం అధ్యక్షురాలు నర్సమ్మ పాల్గొన్నారు.

దేవుడి పేరుతో రాజకీయాలు చేయొద్దు

నవతెలంగాణ-నేరడిగొండ

దేవుడి పేరుతో రాజకీయాలు చేయొద్దని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపును కాంక్షిస్తూ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుళ్ల పేరు చెప్పి రాజకీయాలు చేయడం సరికాదని, అలా చేయడంలో వారి స్వార్థం తప్ప ఏమీ లేదన్నారు. 10 ఏండ్ల బీజేపీ పాలనలో ఏం చేసిందని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టడం సరికాదని, ప్రజల సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేయాలని తెలిపారు. స్వార్థం కోసం దేవుళ్ల పేరుతో రాజకీయ చేయొద్దన్నారు. కాంగ్రెస్ ఆరు హామీలు ఇచ్చింది గాని ఏ హామీ కూడా ఇప్పటి వరకు సరైన పద్ధతిలో అమలులోకి రాలేదన్నారు. ప్రజలు ప్రతి ఒక్కటి గమనిస్తున్నారని, ఎవరు న్యాయం చేస్తారో ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. బీఆర్ఎస్ మాత్రమే ప్రజలకు న్యాయం చేస్తుందని, పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కుని ఎంపీగా గెలిపించాలని ఓటర్లను కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | మే 03, 2024 | www.navatelangana.com

పదిలో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని శ్యాంపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని పదో తరగతిలో సత్తా చాటి మండలంలో మొదటి స్థానంలో నిలిచింది. జెడ్పీఎస్ఎస్ శాంపూర్ పాఠశాలకు చెందిన కేంద్రే అంజలి, షేక్ సానియాలు 9.7జీపీఏ సాధించారు. దీంతో పాఠశాల యజమాన్యం, ప్రధానోపాధ్యాయులు భరత్



చౌహన్ గురువారం వారికి శాలువా కప్పి, స్వీట్స్ తినిపించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరూ కష్టంతో కాకుండా ఇష్టంతో చదువాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం నాతరి రమేష్, రాజ్ కుమార్, కృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు ఉచితంగా గొడుగులు అందజేత

నవతెలంగాణ-ఖానాపూర్

పెండ్లిరోజు సందర్భంగా కొందరు పార్టీలు చేసుకోవడం హోటళ్లకు వెళ్లి కేకులు కట్ చేసి సెలబ్రేషన్లు చేసుకోవడం లాంటివి చేస్తుంటారు. కానీ ఖానాపూర్ పట్టణానికి చెందిన సంధ్యాకిషన్‌రెడ్డి దంపతులు తమ 28వ పెండ్లి రోజును పురస్కరించుకొని గురువారం ఎండకు ఇబ్బంది పడుతున్న చిరువ్యాపారులకు ఉచితంగా రూ.10వేల విలువగల గొడుగులు పంపిణీ చేశారు. ఎండలో కూర్చొని వేడికి ఇబ్బంది పడుతున్న చిరువ్యాపారులను చూసి తనవంతు సాయంగా గొడుగులను అందజేశారు. అంతేకాకుండా మరో 10 గొడుగులు అందజేయనున్నట్టు తెలిపారు.



కేసీఆర్ ప్రభుత్వంలోనే అభివృద్ధి



నవతెలంగాణ-తాంసి

గతంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ప్రతీ గ్రామం అభివృద్ధి జరిగిందని, గతంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని అన్నారు. గురువారం పొన్నారిలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు కోసం మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల జనరల్ సెక్రటరీ రమణ మాట్లాడుతూ గత పది సంవత్సరాలు కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అయిందని అన్నారు. రైతులకు ఋణ మాఫీ కాలేదని, రైతుబంధు పూర్తి స్థాయిలో కాలేదని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు రెండు ఒక్కటే అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థికి కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించు కుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో మహేందర్, కృష్ణ, వినోద్‌రెడ్డి, అశోక్, గోవర్ధన్‌రెడ్డి, కాంతారెడ్డి, ఉత్తం, లక్ష్మీపతి, శంకర్ ఉన్నారు.

బీఆర్ఎస్‌కు బిగ్ షాక్

- సారంగాపూర్‌లో బీఆర్ఎస్ ఖాళీ



నవతెలంగాణ-సారంగాపూర్

బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ తగిలింది. మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం సారంగాపూర్ మండలంలోని ముఖ్యనాయకులంతా బీఆర్ఎస్‌కు రాజీనామ చేసి, హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేశారు. వారికి సీఎం రేవంత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని ఆత్రం సుగుణను అత్యంత మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల ప్రజాప్రతినిధులు రైతుబంధు జిల్లా అధ్యక్షులు వెంకట్ రామ్‌రెడ్డి, డీసీసీ డైరెక్టర్ ఐర నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ అట్లా మహిపాల్‌రెడ్డి, అడెల్లి మాజీ చైర్మెన్లు మాధవ్‌రావ్, ఐయిటి చందు, ఉట్లా రాజేశ్వర్, సొసైటి చైర్మెన్ మాణిక్‌రెడ్డి, వైస్ చైర్మెన్ లక్ష్మీ నారాయణ, వైస్ ఎంపీపీ రాధ భూమేష్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ఉపసర్పంచులు, మాజీ డైరెక్టర్‌లు, నాయకులు, కాంగ్రెస్ పార్టీలో చేరారు.

బీజేపీని ఓడించి, కాంగ్రెస్‌ని గెలిపించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

బీజేపీ ప్రజావ్యతిరేక పాలనతో ప్రజలు విసిగిపోయారని,తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం ఆదిలాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణకు మద్దతుగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని 12 వార్డు పరిధిలోని 3 జోన్‌లో ఇంటింటి ప్రచారాన్ని చేపట్టి ప్రజలకు కాంగ్రెస్ మేనిఫెస్టో అంశాలను వివరించారు. కేవలం మత రాజకీయాలను ప్రోత్సహిస్తూ అభివృద్ధిని గాలికి వదిలేస్తుందని అన్నారు. ధరల పెరుగుదలతో సామాన్యుల నడ్డివిరుస్తున్న బీజేపీ రానున్న ఎన్నికల్లో బుద్ధిచెప్పాలని మే 13న జరగనున్న ఎన్నికల్లో బ్యాలెట్‌లో సీరియల్ నెంబర్ 2పై ఉన్న చేతిగుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేంద్రంలో ఈ మారు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక సీట్లు సాధించి ఆరు గ్యారంటీల అమలు చేసి తీరుతుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, వేముల నాగరాజు, రంజిత్‌రెడ్డి, రెండ్ల రాజన్న, మాదేల శ్రీనివాస్, అడెల్లు, ఫెరోజ్‌ఖాన్, బుక కిరణ్, హిత్యస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ చట్టాన్ని అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే



నవతెలంగాణ-కడెం

ఉపాధిహామీ చట్టాన్ని అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు వాజిద్‌ఖాన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు కోసం మండల నాయకులు కడెం పెద్దూర్ పట్టణ శివారులో ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న కూలీల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 5 గ్యారంటీలను అమలు చేసిందని తెలిపారు. ఆగస్టు 15న రైతు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. దేశాభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తూ ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మండల అధ్యక్షులు బబ్లు, నాయకులు షేక్ రఫీక్, తుట్ల గంగాధర్, బ్రహ్మచారి, వాసుద్దీన్, షర్ఫుద్దీన్, బైరి శీను, నవీన్ పాల్గొన్నారు.

తాటి ముంజలు భలే మజా..!

- తింటే చలువదనం.. వేసవి తాపానికి ఉపశమనం..



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

వేసవిలో మాత్రమే లభించే తాటిముంజలు తింటే ముజాగా ఉంటాయి. పీచు పదార్థంతో కూడి ఉండే ముంజలను తింటే జీర్ణ వ్యవస్థ బాగా పనిచేయడంతో పాటు శరీరానికి ఎంతో చలువను ఇస్తాయి. తీవ్రమైన ఎండలు కాసే సమయంలో మాత్రమే దొరికే ముంజలు వేసవి తాపానికి సైతం ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తాయి. తాటికాయలను చెట్టు పైనుంచి కోసిన వెంటనే తీసిన ముంజలను తింటే తియ్యగా ఎంతో రుచికరంగా అనిపిస్తాయి.

శ్రమ ఎక్కువైనా లాభదాయకమే...

తాటి కాయలను తేవడానికి తెల్లవారు జామునే చెట్లు ఎక్కి గెలలను కోసి కిందికి దించుతారు. కిందకు దించిన గెలల నుంచి కాయలను వేరు చేస్తారు. కాయలనుంచి ముంజలను కోసి అమ్ముతారు. ఇదంతా ఎంతో శ్రమతో కూడుకున్న పని అయినప్పటికి వేసవి సీజన్‌లో లాభదాయకమేనని సదరు కార్మికుడు సింగం రాజాగౌడ్ తెలిపారు. గిరాకిని బట్టి రోజుకు రూ.1500 నుంచి 2000 వరకు వస్తాయని తెలిపారు.

రూ.100కు డజను ముంజలు...

ప్రస్తుతం మార్కెట్‌లో విడిగా ఒక ముంజ రూ.10కి అమ్ముతున్నారు. డజను చొప్పున తీసుకుంటే రూ.100 ధర ఉంది. ఖానాపూర్ ప్రాంతంలో దిలావర్‌పూర్, ఎక్బాల్‌పూర్ తదితర గ్రామాల్లో పలువురు ముంజలను అమ్ముతున్నారు. ఈ ప్రాంతం నుంచి నిర్మల్, నిజమాబాద్ తధితర జిల్లాలకు ముంజలను తీసుకెళ్లి విక్రయిస్తారు.

కోసే వారు లేక చెట్టుపైనే ముదిరి పోతున్నాయి

ఈతరం యువకులు తాటి చెట్లను ఎక్కడం లేదు. గతంలో గౌడకులస్తులందరికి చెట్లు ఎక్కడం అలవాటు ఉండేది. ఇతర కులాల వారు కూడా చెట్లు ఎక్కి గెలలు తెంపేవారు. ఇప్పుడు యువత తాటి చెట్లు ఎక్కడానికి అసక్తి కనబరుచడం లేదు. అక్కడక్కడ కొందరు మాత్రమే తాటి చెట్లు ఎక్కేవారు ఉన్నారు. అందుకే చెట్లకు కాసిన తాటికాయలు చెట్టుపైనే ముదిరిపోతున్నాయి. గతంలో ఈ పరిస్థితి ఉండేది కాదు.

సింగం రాజాగౌడ్, గోడల పంపు గ్రామం

ఓటరు స్లిప్పుల పంపిణీకీ ఎండ బెడద

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఎండల తీవ్రత ఇబ్బందిగా మారింది. అంగన్‌వాడీ టీచర్లకు మరింత సమస్యగా ఉందంటున్నారు. పోలింగ్‌కు మరో 9 రోజుల సమయం మాత్రమే ఉండటంతో అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటా తిరిగి ఓటర్లకు పోల్ చిట్టీలు ఇస్తున్నారు. ఒక్కో టీచర్‌కు ఒక్కో పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఓటర్లందరికి పోల్ చిట్టీలు పంపిణీ చేసే బాధ్యతను అప్పజెప్పారు. మే నెల కావడంతో ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఈ క్రమంలో ఉదయం ఇంటి పని ముగించుకొని కొందరు ఓటర్లను కలిసి చిట్టీలు పంచేలోపునే ఎండ తీవ్రత పెరగడంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో సాయంత్రం వాతావరణం చల్లబడిన తర్వాత ఓటర్లను కలిసి రాత్రి వరకు పంపిణీ చేస్తున్నారు. తమకు అప్పజెప్పిన 244 పోలింగ్ స్టేషన్ పరిధిలో 990 వరకు ఓటర్లు ఉండగా ఎండల తీవ్రత వల్ల పంపిణీ

- రాత్రి సమయంలోనూ పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్



చేయడం ఆలస్యం అవుతుందని సదరు అంగన్‌వాడీ టీచర్ చంద్రాణి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 6 నాటికి పోల్ చిట్టీల పంపిణీ పూర్తి చేయాల్సి ఉందని, ఈ క్రమంలో రాత్రి సమయంలో పంపిణీ చేయాల్సి వస్తుందని ఆమె వివరించారు.

మతోన్మాద, ఫాసిస్టు బీజేపీని ఎన్నికల్లో ఓడించాలి

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు శ్రీనివాస్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మతోన్మాద, ఫాసిస్టు బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను ఆదిలాబాద్ ఎంపీగా గెలిపించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం సీపీఐ(ఎంఎల్) నూడెమోక్రసీ ఆధ్వర్యంలో పట్టణంలోని కుమురం భీం భవనంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వెంకట నారాయణ అధ్యక్షతన ఎన్నికల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.శ్రీనివాస్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా దేశంలో సుదీర్ఘ పరిపాలన సాగించిన ఆర్ఎస్ఎస్, బీజేపీ ఫాసిస్టు నియంతృత్వాన్ని దేశంపై రుద్దడానికి తగిన భూమిక తయారు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారన్నారు. ప్రజలపై అన్ని వైపుల నుంచి దాడి చేయడానికి అవసరమైన ప్రాతిపదికను తయారు చేసుకున్నారని అన్నారు. పోరాడే సంస్థలపైన, పోరాటాలపైన తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగించడానికి అవసరమైన విధానాలను, వాటిని అమలు చేయడానికి అవసరమైన చట్టాలను, నిబంధనలను రూపొందించాయన్నారు. సమాంతరంగా అదే కాలంలో తమకున్న అధికారాన్ని ఉపయోగించి పాలకవర్గ ప్రతిపక్ష పార్టీల పైన దాడులు నిర్వహించి రాజ్యాంగం పైన సంపూర్ణ ఆధిపత్యాన్ని సాధించి దేశంపై ఫాసిస్టు నియంతృత్వాన్ని రుద్దడానికి ప్రయత్నిస్తూ ఉన్నాయని అన్నారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న ప్రజా ఉద్యమాల పైన, కార్యకర్తల పైన "ఉపా"లాంటి ఇతర చట్టాలను పెద్ద ఎత్తున ఉపయోగిస్తూ ప్రజాస్వామిక వాతావరణానికి కుదిస్తున్నాయని అన్నారు. అదేవిధంగా ఆదివాసీ, ప్రజా ఉద్యమాల్లో ముందంజలో ఉండి పోరాడినటువంటి కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.జ్యోతి, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజు, పీఓడబ్ల్యూ జిల్లా కన్వీనర్ దుర్గం కళావతి, ఏఐకెఎంఎస్ జిల్లా అరికెల్ల కేశవ్, ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు గౌరాల సుభాష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రజి హరీష్, మడవి గణేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపు ఖాయం



నవతెలంగాణ-కుభీర్

ప్రజల్లో కనిపిస్తున్న విశేష ప్రజాధారణతో బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు ఖాయమని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎన్నిల అనిల్, వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ రేకుల గంగాచరణ్ అన్నారు. గురువారం మండలంలోని చోండి, సాంగ్వి, గొడిసెరా గ్రామాల్లో లోక్‌సభ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5నెలల కాంగ్రెస్ పాలన చూసి ప్రజలు విసిగిపోయారని విమర్శించారు. గత కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు గుర్తు చేశారు. దీంతో తెలంగాణ గళం పార్లమెంట్‌లో వినిపించాలనంటే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రతి ఇంటింటికి వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచారంలో వైస్ ఎంపీపీ మోహియోద్దీన్, మాజీ సర్పంచ్ బాబు, డాక్టర్ రాజన్న, సంతోష్ గ్రామస్తులు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

జొన్న పంట దగ్ధం

నవతెలంగాణ-తాంసి

మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన రైతు గట్టు గంగయ్య జొన్న పంట సాగు చేయగా గురువారం అక్కడ చేనులో వ్యర్థలకు పెట్టిన నిప్పు పక్క చేనులోకి వ్యాపించింది. గంగయ్య తన జొన్న పంట సగం కోసి ఉంచగా, మిగిలిన జొన్న పంట కోసే సమయంలో అగ్ని ప్రమాదానికి కాలి బూడిదైంది. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా సకాలంలో సంఘటన స్థలానికి చేరుకొని, మంటలను మరో చేనులోకి వ్యాపించకుండా అదుపు చేశారు. దాదాపు రూ.15 వేల వరకు జొన్న పంట దగ్ధమైనట్టు ఆవేదన వ్యక్తం చేశారు.



కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ఓడించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాదిగల పట్ల వివక్ష చూపుతున్నటువంటి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ఓటు అనే అస్త్రంతో చిత్తు చిత్తుగా ఓడించాలని మాదిగ ఉపకులాల ప్రజలకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జీ రేగుంట కేశవరమ్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గతంలో దేశంలోనూ రాష్ట్రంలోనూ పది సంవత్సరాలుగా అధికారంలో ఉండి కూడా ఎస్సీ వర్గీకరణపై కమిషన్ వేసి, నివేదిక వచ్చిన నిర్లక్ష్యం చేసి చేతులు దులుపుకోవడం తప్ప చేసిందేమి లేదన్నారు. అదే విధంగా ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి 80లక్షల మంది మాదిగలను రాజకీయంగా సమాధి చేయాలని చూస్తున్నాడని ఆరోపించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 17 పార్లమెంటు స్థానాల్లో మూడు ఎస్సీ స్థానాలైనా పెద్దపల్లి, వరంగల్, నాగర్ కర్నూల్, ఒకటి కూడా మాదిగలకు ఇవ్వకుండా రాజకీయంగా అణిచివేతకు గురి చేస్తున్నాడని అన్నారు. ఎస్సీ లోక్‌సభ మూడు స్థానాల్లోనూ ఒకే సామాజిక వర్గానికి టికెట్లు కేటాయించడం సమంజసం కాదన్నారు. గత 10 ఏండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ మాదిగలను అడుగడుగునా అణచివేసే కుట్రలు చేసిందన్నారు. ఈ నెల 4న హైదరాబాద్ ఇంద్రాపార్క్ వద్ద కాంగ్రెస్ పార్టీ మాదిగలను రాజకీయంగా ఎదగనియ్యకుండా చేసిన కుట్రకు నిరసనగా వేలాది మందితో మందకృష్ణ మాదిగ నేతృత్వంలో నిరసన దీక్ష చేయబోతున్నామని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న మాదిగ ఉపకులాల విద్యార్థి మేధావులు సామాజిక న్యాయం కోరుకునే ప్రజాస్వామ్యవాదులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సీనియర్ నాయకులు బాలేరావు నందకుమార్, కామ్లే బాలాజీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్, శ్రీను, దుబ్బాక సుభాష్, పిట్టల సత్యనారాయణ, బిక్కి మురళీకృష్ణ, సిరిసిల్ల భూమయ్య, శనిగరపు రవి, రేగుంట మహేష్, దాసరి రాంప్రసాద్, చిట్టి రవి, ఇప్ప మహేష్, పెగడపల్లి అనిల్ పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుని గెలిపిద్దాం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుని గెలిపిద్దామని బీఆర్ఎస్ నాయకులు చందాల రాజన్న తెలిపారు. గురువారం మండలంలోని వాఘాపూర్ గ్రామపంచాయతీలో ఎంపీ అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో ఆత్రం సక్కుని గెలిపించి, కేసీఆర్‌కు గిఫ్టుగా ఇద్దామని అన్నారు. ఈ ఎం.గోవర్ధన్‌రెడ్డి, మాడవి నారాయణ, అసిఫ్ ఖాన్, విలాస్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టణంలో మున్సిపల్ చైర్మెన్ ప్రచారం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు తరపున మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు. గురువారం వార్డు నెంబర్ 19 పరిధిలోని గాంధీనగర్‌లో పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ గత బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని వివరిస్తు కారుగుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ అమలుకు సాధ్యం కానీ హామీలతో కాంగ్రెస్ రాష్ట్రంలోకి అధికారంలోకి వచ్చిందని, అవే హామీలను మళ్లీ చెబుతూ పార్లమెంట్ ఎన్నికల్లో లబ్దిపొందాలని చూస్తుందని అన్నారు. ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయలేదని ప్రజలు చెబుతున్నారని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ కు మద్దతు ఇస్తామని భరోసా కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అజయ్, ఆశ్రాఫ్, సాజిదోద్దీన్, కోవ రవి, సంజయ్, భరత్, రామ్ కుమార్, పండ్ల శీను, అశోక్ స్వామి, దమ్మపాల్, సలీమ్, మిషు, పర్వీన్ పాల్గొన్నారు.

రాష్ట్ర కమిటీ సమావేశానికి హాజరైన జిల్లా నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో గురువారం నిర్వహించిన యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.స్వామి, వి.అశోక్ మాట్లాడుతూ కుటుంబ సంక్షేమ నిధి పథకం వల్ల ఇప్పటికే మరణించిన 22 మంది ఉపాధ్యాయుల కుటుంబాలకు రూ.6లక్షల చొప్పున సంఘీభావ విరాళాలు చెల్లించి, యూటీఎఫ్ విశిష్టతను చాటుకుందని, వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుందని అన్నారు. ఈ సాహసం యూటీఎఫ్‌కు మాత్రమే సాధ్యమని అన్నారు.

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని మేడిగూడ రోడ్ అంగన్‌వాడీ కేంద్రం-3లో గురువారం బాల్య వివాహాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన గ్రామాభివృద్ధి కమిటీ చైర్మెన్ రామ్‌రెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాలు అనగా యుక్త వయసు రాక ముందే బాల్య దశలో పెండ్లిలు చట్ట రీత్యా నేరమని అన్నారు. బాల్య వివాహాలతో పుట్టే పిల్లలు అనారోగ్యంగా పుడుతారని, గర్భ విచ్చింతి జరుగుతుందని తెలిపారు. పెండ్లి వయస్సు అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21 ఉంటేనే పెండ్లి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఇప్ప కళావతి, ఆశ వర్కర్ సుంకరి వెంకటమ్మ, కిషోర్ బాలికలు, మహిళలు, గర్భిణీలు పాల్గొన్నారు.

కష్టపడి చదివి జిల్లాకు మంచి పేరు తేవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



విద్యార్థి చిన్ననాటి నుండి బాగా చదివి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏపీజే అబ్దుల్ కలాం పాఠశాలకు చెందిన జోయ అఫ్షీన్ ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాలలో 10 జీపీఏ సాధించింది. కాగా గురువారం ఆమెను శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విద్యార్థిని ఉత్తమ ఫలితాలకు దోహదపడిన పాఠశాల యాజమాన్యానికి, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులందరికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సయ్యద్ అబ్దుల్ ఫయాజ్, కరెస్పాన్‌డెంట్ సయ్యద్ అబుల్ హసన్, పాఠశాల ప్రిన్సిపల్ లోనారే కిరణ్, ఉపాధ్యాయులు సాయి ప్రకాష్ పాల్గొన్నారు.

ఐరిష్ విధానంలో వరిధాన్యం కొనుగోలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



మండలంలోని సీతానగర్ వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో అధికారుల ఆదేశానుసారం గురువారం ఓటీపీతో పాటూ ఐరిష్ విధానంలో వరిధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు. కొనుగోలు చేసిన ధాన్యం తాలూకా డబ్బుల చెల్లింపులో పారదర్శకత పాటించాలనే విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సీఈఓ సతీష్ మాట్లాడుతూ గతంలో ఆధార్ కార్డు ఓటీపీతో కొనుగోలు చేశామన్నారు. ఇప్పుడు జిల్లా అధికారుల ఆదేశాలను పరిగణలోకి తీసుకుని ఐరిష్ విధానాన్ని పాటిస్తున్నామని తెలిపారు. యాసంగి సాగులో వరిధాన్యం పండించిన రైతులు కొనుగోలు కేంద్రంలో విక్రయించుకోవాలని తెలిపారు.

సీఎం సభ సైడ్ లైట్స్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

- ఉదయం నుండి సభ ప్రాంగణానికి ప్రజలు చేరుకున్నారు.
- జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో బందోబస్తులో భాగంగా ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిబంధనలు విధించారు.
- పోలీసులు సరిగ్గా సహకరించడం లేదని మధ్యలో డిసిసి అధ్యక్షుడు చెప్పారు.
- జిల్లా కేంద్రానికి వచ్చే నాలుగు రహదారిల ప్రారంభంలో ఆయ ప్రాంతాల వారికి భోజనాలు ఏర్పాటు చేశారు.
- వేసవి నేపథ్యంలో ప్రజల కోసం సభ ప్రాంగణం వద్ద పెద్ద ఎత్తున మజ్జిగ నీళ్ల ప్యాకెట్లు అందజేశారు.
- సీఎం సభ ప్రాంగణానికి వస్తున్నప్పుడు చప్పట్లతో లేచి నిలబడి స్వాగతం పలికారు.
- సుగుణక్క సభ ప్రాంగణానికి వచ్చిన ప్రజల దగ్గరికి వెళ్లి ఓట్ల కోసం ప్రతి ఒక్కరిని అడిగింది.
- ప్రత్యేక వాహనాలను ఊరు బయట నిలబెట్టడంతో ప్రజలతో రహదారులు కిక్కిరిసిపోయాయి.
- సభ కోసం ఏర్పాటు చేసిన సభాస్థలి వద్ద ముఖ్యఅతిథి కోసం ఏర్పాటు చేసిన ర్యాంపు ఆకట్టుకుంది.
- రేవంత్ రెడ్డి ర్యాంపు పై చివరి వరకు వచ్చి ప్రతి ఒక్కరిని పలకరించారు.
- జిల్లాలో ఎమ్మెల్యేలు లేకపోయినప్పటికీ సభ సక్సెస్ కావడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరంలో మునిగాయి.

వడదెబ్బతో ఒక్కరి మతి

నవతెలంగాణ-బెజ్జూరు



మండలం గబ్బాయి గ్రామానికి చెందిన పోర్థటి శ్రీనివాస్(40) సంవత్సరాలు అనే వ్యక్తి గురువారం వడదెబ్బతో మృతి చెందారు. శ్రీనివాస్ రెండు రోజుల క్రితం దహేగాం మండలం పోలంపల్లి గ్రామానికి వివాహ కార్యక్రమానికి వెళ్లి వాంతులు విరేచనాలు చేసుకోవడంతో మంచిర్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. మృతునికి భార్య జానా బాయి, ఒక కూతురు, ముగ్గురు కుమారులున్నారు.

బీఆర్ఎస్‌లో పలువురు చేరిక



నవతెలంగాణ-బెజ్జూరు

కాంగ్రెస్ నుండి బీఆర్ఎస్‌లో ఎమ్మెల్సీ దండె విఠల్ ఆధ్వర్యంలో పలువురు మండల కాంగ్రెస్ నాయకులు చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి కాంగ్రెస్ నుండి మాజీ ఎంపీటీసీ, నాయకులు పెద్దఎత్తున పార్టీలో చేరినట్టు ఆయన తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 12 ఎంపీ సీట్లను గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసిందని, కనీసం రైతుబంధును వేయలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. చాలామంది ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటే బాగుండేదని అంటున్నారన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇందులో నాయకులు రంగు సురేష్ గౌడ్, సోయం చిన్నయ్య, సామల రాజన్న ఉన్నారు.

నగదు, బంగారం ఎత్తికెళ్లిన దుండగులు

నవతెలంగాణ - సిర్పూర్(టి)



సిర్పూర్ మండల కేంద్రంలోని షేక్ మోహల గ్రామానికి చెందిన అబ్దుల్ అస్లాం ఇంటిలో దొంగతనం జరిగింది. ఏఎస్ఐ రాములు తెలిపిన వివరాల ప్రకారం అబ్దుల్ అస్లాం ఏప్రిల్ 19వ తేదీన హైదరాబాద్‌లో తమ బంధువుల పెండ్లికి వెళ్లాడు. తిరిగి గురువారం వచ్చి ఇంటిలో చూడగా బీరువా తాళాలు తీసి అందులో ఉన్న 24 తులాల వెండీ ఆభరణాలు, ఒక తులం బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదుతో పాటు గల్లగురిలో ఉన్న డబ్బులు మొత్తం సుమారు రూ.20 వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించినట్టు తెలిపారు. బాధితుడు అబ్దుల్ అస్లాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

జీపీఎఫ్, పాక్షిక ఉపసంహరణ బిల్లులను జమ చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మార్చి 2023 నుండి ఉపాధ్యాయుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ లోన్లు, పాక్షిక ఉపసంహరణ బిల్లులు ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే జమ చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు కోరారు. గురువారం ఈ విషయమై జిల్లా పరిషత్ సీఈఓను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల కుటుంబ అవసరాలకు కోసం జమ చేసిన జీపీఎఫ్ లోను, పాక్షిక ఉపసంహరణ బిల్లు సంవత్సరంపైగా ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. దీనితో వేల రూపాయల్లో నష్టపోవాల్సి వస్తుందని వెంటనే వాటిని జమ చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలపై అధికారులు స్పందించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే ప్రకాష్ పాల్గొన్నారు.



రిజర్వేషన్ల రద్దుపై బీజేపీకి గుణపాఠం తప్పదు

- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాజ్యాంగం ప్రజలకు కల్పించిన రిజర్వేషన్ల విషయంలో ఆర్ఎస్ఎస్ మనువాద సిద్ధాంతాలతో పుట్టిన బీజేపీ వక్రంగా ఆలోచించడం పట్ల రానున్న రోజుల్లో తగిన గుణపాఠం తప్పదని కేసీఆర్ రిజర్వేషన్లపై మాట్లాడి ప్రస్తుతం ఎలాంటి పరిస్థితులు ఉన్నారని విషయం అందరికీ తెలిసిందేనని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షులు విశ్వప్రసాద్ ఇంట్లో విలేకరులతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాల నుండి పుట్టిన బీజేపీ రిజర్వేషన్ల రద్దుకు కుట్రలు జరుపుతోందన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో రాజ్యాంగం ఉంచితే దాని విలువలు ప్రతి ఒక్కరికి తెలుస్తాయన్నారు. ప్రభుత్వ భూములను రక్షించడంతో పాటు పేదలకు పంపిణీ చేయడం, ఇండ్ల పంపిణీ కూడా చేస్తామని తెలిపారు. తమ హయాంలో ప్రారంభమైన తుమ్మిడిహేట్టి ప్రాజెక్టు పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. జిల్లాలను తీసివేయడం జరగదని, అయితే కొన్ని మార్పులు మాత్రం ఉంటాయని వివరించారు. ఆసిఫాబాద్ జిల్లాలో విద్య, వైద్యం, రోడ్లు, ఇరిగేషన్, చారిత్రాత్మక ప్రాంతాల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లాకు వైద్యులు రావడం లేదని అయితే ఇతర జిల్లాలతో పోలిస్తే ఇక్కడ భవిష్యత్తులో అలవెన్సులు ఎక్కువగా ఇచ్చి వైద్యులు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో రక్తహీనతతో బాధపడే వారి సంఖ్య ఎక్కువగా ఉందని దానిపై మొదట దృష్టి కేంద్రీకరించినట్లు వివరించారు. బీజేపీ కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ అటవీ సంపదను అప్పనంగా వారికి అప్ప చెబుతుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి దానిపై ఎటువంటి హక్కులు లేకుండా కేంద్ర ప్రభుత్వం చేసిందని దానికి అటవీశాఖ వంత పాడుతుందన్నారు. మోడీ ప్రతి నియోజకవర్గంలో ప్రచారం చేయాలని సంకల్పంతో స్వతంత్ర భారత దేశ చరిత్రలో 1952 తర్వాత అత్యధిక సమయంతో కూడుకున్న ఎన్నికలు పెట్టడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, నాయకులు అనిల్ గౌడ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకే అవగాహన వారోత్సవాలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

విద్యుత్ ప్రమాదాల పట్ల సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ, ప్రజలు, జంతువుల ప్రాణాలు రక్షించేందుకు అప్రమత్తంగా ఉండాలనే ఉద్దేశ్యం, ప్రమాదాల నివారణ కోసమే విద్యుత్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నామని విద్యుత్ శాఖ నోడల్ అధికారి గౌతం రెడ్డి తెలిపారు. కాగజ్‌నగర్ డివిజన్ కార్యాలయంలో గురువారం విద్యుత్ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగంలో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కూడిన గోడప్రతులను ఆవిష్కరించారు. అనంతరం నోడల్ అధికారి గౌతం రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు, రైతులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకే వారోత్సవాల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు, సిబ్బంది అందరికీ విద్యుత్ ప్రమాదాలపై కరపత్రం రూపొందించి అవగాహన పెంపొందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా సిబ్బందికి భద్రత పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంజనీర్ సి. నాగరాజు, ఏడీఈ పి. శ్రీనివాస్, టౌన్ ఏఈ కదురాకర్, రూరల్ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రత్యేక తరగతులు రద్దు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కేజీబీవీలలో ప్రత్యేక తరగతులను నిర్వహించాలని ఆలోచిస్తున్నారని, వాటిని రద్దు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. జిల్లా విద్యాధికారి అశోక్‌ను సంఘం తరఫున కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీ ఉపాధ్యాయులను వెంటనే రెన్యువల్ చేయాలన్నారు. ఉపాధ్యాయులను ఏలాంటి ఉత్తర్వులు లేకుండా విధుల్లో పాల్గొనమనడం, వేసవి సెలవులలో ప్రత్యేక తరగతులను నిర్వహించమనడం లాంటివి ఉపసంహరించుకోవాలని కోరారు. వేసవి తాపం, ఎన్నికలు విధులు దృష్ట్యా వేసవి సెలవుల్లో ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను రాష్ట్రంలో ఎక్కడ నిర్వహించడం లేదన్నారు. జిల్లాలో కూడా ప్రత్యేక తరగతుల నిర్వహణ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని ఉపాధ్యాయులకు బాసటగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆడే ప్రకాష్, నాయకులు మధుకర్ పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై దుష్ప్రచారం నమ్మకండి : ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లపై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. మండలంలోని పాత సార్సాల గ్రామంలో గురువారం విజయసంకల్ప యాత్రలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రిజర్వేషన్ల గురించి రేవంత్ రెడ్డి దుష్ప్రచారం చేసి దిగజారుడు రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నాడన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు రద్దు చేసే ఆలోచన భారతీయ జనతా పార్టీకి ఏనాడు లేదని, త్వరలోనే వారి రిజర్వేషన్లు పెంచుతామని తెలిపారు. గ్రామీణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇతోదికంగా నిధులు సమకూరుస్తుందని వివరించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి గొడం నాగేష్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుల్ల అశోక్, మల్లయ్య పాల్గొన్నారు.

భద్రతలు పాటిస్తే ప్రమాదాలు నివారించొచ్చు

- విద్యుత్ ఎస్ఈ వాసుదేవ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



వారోత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న విద్యుత్ ఎస్ఈ వాసుదేవ్, ఉద్యోగులు

విద్యుత్ వినియోగదారులు సరైన భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలు నివారించే అవకాశం ఉంటుందని విద్యుత్ శాఖ ఎస్ఈ వాసుదేవ్ అన్నారు. వారం రోజుల పాటు నిర్వహించే విద్యుత్ శాఖ వారోత్సవాలకు సంబంధించి వాల్ పోస్టర్ అధికారులతో కలిసి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 1 నుండి 7 వరకు సర్కిల్ వ్యాప్తంగా భద్రత వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు భద్రత సూత్రాలు పాటిస్తూ పని చేయాలని, పని చేసే స్థలాల్లో ఎర్త్ రాడ్‌లు తప్పనిసరిగా వాడాలన్నారు. వినియోగదారులు కరెంటు వైర్లు తెగిపడినపుడు సంబంధిత సిబ్బందికి తెలియజేయాలన్నారు. దండాల మీద బట్టలు ఆరవేస్తున్నప్పుడు ఆ దండాలు కరెంటుకు సంబంధించిన వైర్లకు దూరంగా ఉండాలన్నారు. ఎలాంటి విద్యుత్ సమస్యలున్న అధికారులకు తెలియజేయాలని సూచించారు. ప్రయివేట్ వ్యక్తులతో పనరులు చేయించవద్దని సూచించారు. విద్యుత్ ప్రమాదలపై అవగాహన కల్పించేల శాఖ తరఫున కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు వాటి గురించి తెలుసుకుంటు ప్రమాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజనీర్ సదాశివ్, ఎమ్మార్టి ఏఈ ప్రత్యూష, సబ్-ఇంజనీర్ శేఖర్ పాల్గొన్నారు.

హత్యకేసులో ఆరుగురు నిందితులకు జైలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

హత్య కేసులో ఆరుగురు నిందితులకు జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ తీర్పు ఇచ్చారు. వాంకిడి సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం వాంకిడి మండలంలోని కిరిడీ గ్రామంలో భూ తగాదాల విషయంలో జంట హత్యలు చేసిన ఆరుగురు నిందితులకు జీవిత ఖైదీలతో పాటు ఒక్కొక్కరికి రూ.15000 జరిమాన విధిస్తూ తీర్పు ఇచ్చారు. గ్రామానికి చెందిన తోడాసం బోజ్జిరావు, సేడ్మకే గంగారం, సేడ్మకే తెలంగ్ రావు, సేడ్మకే ఎశ్వంత్ రావు, సేడ్మకే జంగు, తోడసం శారద పథకం ప్రకారం భూతగాధాల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన రాయి సిడం శ్యాంరావు ఆయన భార్య తారబాయిలను 2019 జూన్ 21న గ్రామ శివారులో గొడ్డళ్లతో నరికి చంపారు. పోలీసులు కేసు నమోదు చేయగా విచారణ జరిపారు. గురువారం సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరాన్ని రుజువు చేయడంతో నిందితులకు జీవిత ఖైదితో పాటు ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున జరిమాన విధిస్తు జిల్లా జడ్జి శిక్ష వేసినట్టు ఆయన తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు అదనపు ఓటింగ్ యంత్రాలు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

లోక్‌సభ ఎన్నికలు నేపథ్యంలో ఈ నెల 13న జరుగనున్న పోలింగ్ కోసం జిల్లాకు అదనపు ఓటింగ్ యంత్రాలు వచ్చాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణకు జిల్లాకు చేరుకున్న అదనపు బ్యాలెట్ యూనిట్లు ఓటింగ్ యంత్రాలకు గురువారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమక్షంలో ప్రథమ స్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ పోలింగ్ కోసం భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాకు చేరుకున్న అదనపు బ్యాలెట్ యూనిట్లను ఈవీఎం గోదాంలో భద్రపరిచి ప్రథమ స్థాయి పరిశీలన చేయడం జరుగుతుందని తెలిపారు. ర్యాండమైజేషన్ పూర్తి అయిన తరువాత ఆయా సెగ్మెంట్లకు కేటాయించిన ప్రకారంగా గట్టి బందోబస్తు ఏర్పాట్ల మధ్య తరలించి స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచి 24 గంటల పాటు బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ కార్యక్రమాలు ఉంటాయని, 6 వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని తెలిపారు. ప్రతి అంశాన్ని వీడియో చిత్రీకరించడం జరుగుతుందని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఎన్నికల డిప్యూటి తహసీల్దార్ జితేందర్, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ రుణ సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో నెలకొన్న సీఎంపీఎఫ్ రుణ సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీసైదా అన్నారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో గురువారం ఆర్కే 7 గనిలో కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 10 నెలలుగా సీఎంపీఎఫ్ లోన్లు పెండింగ్‌లో ఉండడం వల్ల కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. గనిలో వెంటిలేషన్ సమస్య ఉందని, మైసమ్మ షెడ్, సైకిల్ షెడ్లు అదనంగా నిర్మించాలని, నాణ్యమైన పనిముట్లను అందించాలని కోరడం జరిగిందన్నారు. గని ఏజెంట్, మేనేజర్‌తో చర్చించగా యాజమాన్యం సానుకూలంగా స్పందించి త్వరితగతిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఏరియా కార్యదర్శులు ప్రసాద్ రెడ్డి, మారపల్లి సారయ్య, బుచ్చయ్య, ఫిట్ కార్యదర్శిలు బీర రవీందర్, దాడి రాజయ్య, మోతే లచ్చయ్య, ఆకుల లక్ష్మణ్, గునిగంటి నరసింహారావు, సదానందం, సిహెచ్ నవీన్ రెడ్డి, కుమారస్వామి, గొల్లపల్లి రామచందర్, నాగేశ్వరరావు, అగ్గు శ్రీకాంత్, అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి



నవతెలంగాణ-నస్పూర్

పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపెల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు నడిపెల్లి విజిత్ రావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా నస్పూర్ మున్సిపాలిటీలోని వార్డ్ నెంబర్ 18, 19 వార్డులలో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచరణకు సాధ్యం కానీ భూటకపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్లు రాబట్టుకుందని విమర్శించారు. హామీల అమలులో ముఖం చాటేసిన కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని, కేసీఆర్‌కు ప్రతి కుటుంబం మద్దతుగా వుండాలన్నారు. మన రాష్ట్రం, మన కుటుంబం, మన పార్టీ అనే నినాదంతో కారు గుర్తుకు ఓట్లు వేసి పెద్దపెల్లి పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మున్సిపాలిటీ అధ్యక్షులు అక్కూరి సుబ్బయ్య, పట్టణ కార్యదర్శి మెరుగు పవన్ కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షులు గరిసే రామస్వామి, కౌన్సిలర్స్ వంగ తిరుపతి, మాజీ జడ్పీటీసీ తిప్పని రామయ్య, నాయకులు గట్టయ్య, రాయలింగు, గుమ్మడి శ్రీనివాస్, రవి, వెంకటేష్, తిరుపతి, ఎర్రయ్య, జాబ్రీ గౌస్, సంపత్, బీమయ్య, వార్డుల అధ్యక్షులు తిప్పని బానేష్, రఫిక్ ఖాన్, రాజేశ్వర్ రెడ్డి, యూత్ నాయకులు నోముల నరేందర్ రెడ్డి, కాటం రాజు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శుక్రవారం | మే 03, 2024 | www.navatelangana.com

బీఆర్ఎస్ విస్తృత ప్రచారం

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మున్సిపాలిటీలోని 1, 2, 3 వార్డుల్లో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎంపీ అభ్యర్థి తరపున బీఆర్ఎస్ పార్టీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ని కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాస కాంతయ్య, కౌన్సిలర్ చాతరాజు రాజన్న, కో ఆప్షన్ సభ్యుడు నూనె ప్రవీణ్, పాదం శ్రీనివాస్, పెట్టెం తిరుపతి, చుంచు తిరుపతి, గోల్కొండ సత్తయ్య, ముత్తె తిరుపతి, గోపే అశోక్, ఎంబడి అశోక్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కే తమ మద్దతు : ఎమ్మార్పీఎస్

నవతెలంగాణ-నస్పూర్



పార్లమెంట్ ఎన్నికలలో పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణకే పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొంకట రవీందర్ తెలిపారు. గురువారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. దళితుల అభ్యున్నతికి నిత్యం పాటుపడుతున్న కాకా కుటుంబానికి ఎప్పుడు మద్దతు ఉంటుందని, ఎన్నికల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిప్పారపు రమేష్, లక్ష్మయ్య దుమ్మటి నరేష్, ప్రజ్వల్ పాల్గొన్నారు.

లక్ష మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి వంశీని గెలిపించాలి

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్ష మెజారిటీతో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పిలుపునిచ్చారు. మండలంలోని ఎల్లారం, కొత్తూర్, వెంకట్రావు పేట, కొమ్ముగూడెం, దౌడెపల్లి గ్రామాలతో పాటు పలు గ్రామాలలో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ప్రజల బాగుకోరే కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో రావాలన్నారు. యువకుడు విద్యావంతుడైన వంశీని గెలిపిస్తే రానున్న రోజుల్లో యువతకు మంచి ఉపాధి అవకాశాలు కల్పిస్తాడని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తాడన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్ కుమార్, మండల అధ్యక్షుడు పింగళి రమేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, పట్టణ అధ్యక్షుడు అరిఫ్, ఎంపీపీ అన్నం చిన్నన్న, మంగ, డీసీసీ అధికార ప్రతినిధి బియ్యాల తిరుపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమేల రాజు, కౌన్సిల రాందేని వెంకటేష్, ఎంపీటీసీ సుజాత, సురేష్, అనుమండ్ల పద్మ, రవీందర్ రావు, పూర్ణ చందర్ రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- రామగుండం సీపీ శ్రీనివాస్
- కేంద్ర బలగాల అధికారులతో బ్రీఫింగ్ సెషన్



బ్రీఫింగ్ సెషన్‌లో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

నవతెలంగాణ-నస్పూర్

పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు, కేంద్ర బలగాలు బందోబస్తు నిర్వహించేలా సిద్ధంగా ఉండాలని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ (సీఏపీఎఫ్), రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారులతో గురువారం బ్రీఫింగ్ సెషన్ సమావేశాన్ని నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన అన్ని విధుల్లో కేంద్ర బలగాలు రామగుండం కమిషనరేట్ పోలీసులతో కలిసి ఎన్నికల ముందు, పోలింగ్ రోజు, ఎన్నికల తరువాత, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద, కౌంటింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నియంత్రించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఓటర్లకు భయాందోళనలకు అవకాశం లేకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించేలా భరోసా కల్పించడంలో భాగంగా ఫ్లాగ్, రూట్ మార్చ్, బందోబస్త్‌లు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల రోజు, ఎన్నికల తరువాత బందోబస్త్ విధులు నిర్వర్తించాలని, ఎన్నికల రోజు ఎల్‌డబ్ల్యూఈ పోలింగ్ స్టేషన్‌లు, క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లలో స్టాటిక్ బందోబస్త్, మిగతా ఫోర్స్ రూట్ బందోబస్త్, అత్యవసర పరిస్థితి సమయంలో విధులు నిర్వహిస్తారన్నారు. కీలకమైన పాయింట్‌ల వద్ద సెంట్రల్ ఫోర్స్ సిబ్బందితో బందోబస్తు ఉంటుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల భద్రతలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు 2 సీఆర్పీఎఫ్, 3 బీఎస్ఎఫ్ కంపెనీ బలగాలు రాగా అందులో మొత్తం అధికారులు, సిబ్బంది 443 ఉన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి, మంచిర్యాల డీసీపీలు చేతన, అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, సీఆర్పీఎఫ్ అడిషనల్ కమాండెంట్ ఏ.కె పాండే, పరమానంద్ యాదవ్, బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్లు డేవిడ్ లాల్ తనసిమ్మ, భరత్ సింగ్, స్వరూప్ సమంత, డిప్యూటీ కమాండెంట్లు రతన్ లాల్, నరేష్ కెఆర్ షేరన్, ఏసీపీలు జి. కృష్ణ, రమేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గడ్డం కుటుంబాన్ని విమర్శించే స్థాయి కొప్పులకు లేదు

- మండల కాంగ్రెస్ ఇన్‌చార్జి గడ్డం జగన్నాథం



నవతెలంగాణ-కాసిపేట

వివేక్ వెంకటస్వామి కుటుంబంపై విమర్శలు చేసే స్థాయి కొప్పుల ఈశ్వర్, వెంకటేష్ నేతకు లేదనిమండల కాంగ్రెస్ ఇన్‌చార్జి గడ్డం జగన్నాథం అన్నారు. గురువారం ప్రెస్ క్లబ్‌లో ఏరాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రజలను మోసం చేయడానికి బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు వస్తున్నారనీ వారిని నమ్మొద్దని కోరారు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణను భారీ మెజార్టీతో గెల్పించాలని కోరారు. ఈ నెల 4న కొండాపూర్ యాపలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, ఐఎన్టీయూసీ సెంట్రల్ సెక్రటరీ రాపర్తి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ రౌత్ సత్తయ్య, నస్పూరి నర్సింగం, మండల ప్రధాన కార్యదర్శి మైదము రమేష్, గోలేటి స్వామి, పుర్ర కుమారస్వామి యాదవ్, ముత్యంపల్లి టౌన్ అధ్యక్షుడు దారవేణి రాజయ్య యాదవ్, రేషవేణి ఓదెలు యాదవ్, మారం రాజ్ కుమార్, రేషవేణి స్వామి, కుర్మ నర్సయ్య పాల్గొన్నారు.

ఒత్తిడి లేని విద్యాబోధనతో ఉత్తమమైన ఫలితాలు

- కలెక్టర్ బదావత్ సంతోష్



ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

ఒత్తిడి లేని విద్యాబోధన విధానంతో 10వ తరగతిలో ఉత్తమమైన ఫలితాలు సాధించడం అభినందనీయమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో 10వ తరగతి వార్షిక పరీక్షా ఫలితాలలో 10 జీపీఏ సాధించిన తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) బెల్లంపల్లి విద్యార్థులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి వార్షిక ఫలితాలలో సీఓఈ 100 శాతం ఫలితాలు సాధించిందన్నారు. 74 మంది విద్యార్థులల్లో 6 మంది విద్యార్థులు అల్తాటి వినయ్, బొల్లం అభినయ్ తేజ్, జాడి జశ్వంత్, చిగిరి వినిల్ కుమార్, జంగంపెల్లి ప్రణయ్ చరణ్, భుక్య శశివర్ధన్ 10 జీపీఏ సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలువడం ఆదర్శనీయమన్నారు. గురుకులంలో విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందించడమే కాకుండా వారిలో నైపుణ్యాలను పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడమే కాకుండా ఎప్పటికప్పుడు బాధ్యతాయుతంగా యాజమాన్యంతో సహకరిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పాటు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, ప్రిన్సిపల్ ఐనాల సైదులు, సీనియర్ ఉపాధ్యాయులు వరమని ప్రమోద్ కుమార్, అల్లూరి వామన్, విద్యార్థుల తల్లిదండ్రులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జన జాతర సభకు భారీగా తరలిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-నార్నూర్

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం తలపెట్టిన సిఎం రేవంత్‌రెడ్డి జన జాతర బహిరంగ సభకు మండలంలోని వివిధ గ్రామాల నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. జై కాంగ్రెస్ జై జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపిస్తామన్నారు. దేశంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. సభకు బయలు దేరిన వారిలో పార్టీ మండల నాయకులు దేవ్‌రావ్ లోఖండే, మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, ఎంపిటిసి కోలట్కర్ పరమేశ్వర్, యూసఫ్‌ఖాన్, షేక్ సత్తార్, కరీం ఖాన్, గోవింద్‌రావ్, రాథోడ్ కార్తీక్, మాణిక్‌రావ్, షేక్ నసీర్, డిదింబర్, రమేష్, నాందేవ్ ఉన్నారు.

హజ్ యాత్రకు వెళ్లేవారు ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హజ్ యాత్రకు వెళ్లే వారు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటు యాత్రను విజయవంతంగా ముగించుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ సరేందర్ రాథోడ్ అన్నారు. గురువారం టీఎన్జీవోస్ భవనంలో హజ్ సొసైటీ ఆధ్వర్యంలో యాత్రకు వెళ్లే వారికి టీకాలతో పాటు హెల్త్ క్యాంప్ నిర్వహించారు. దీనికి డీఎంహెచ్ఓ ముఖ్య అతిథిగా హాజరై యాత్రకు వెళ్లేవారికి టీకాలు, పోలీయో చుక్కాలు వేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ హజ్ యాత్రకు జిల్లా నుంచి 63 మంది వెళ్తున్నారన్నారు. వారికి వైద్య శాఖ తరపున వ్యాక్సినేషన్ వేయడం జరిగిందన్నారు. యాత్రకు వెళ్లే వారు ఆరోగ్య పరంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వైసీ శ్రీనివాస్, హజ్ సొసైటీ అధ్యక్షుడు షాహిద్ అహ్మద్ తవక్కల్, మహ్మద్ ఆసీఫ్, వైద్యులు పాల్గొన్నారు.

ఉత్పత్తి ఉత్పాదకత, రక్షణపై సమీక్ష సమావేశం



రక్షణపై ఉద్యోగులకు సూచనలు చేస్తున్న జీఎం సంజీవ్

నవతెలంగాణ-నస్పూర్

జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో ఏరియా అధికారులతో ఉత్పత్తి ఉత్పాదకత, రక్షణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఏరియాలో ఉన్న భూగర్భ, ఉపరితల గనులలో తీసుకుంటున్న రక్షణ చర్యలపై, ఉద్యోగుల సంక్షేమం సంబంధించిన ప్రతి అంశాన్ని ఎల్లవేళలా పర్యవేక్షిస్తుండాలని, ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ అభివృద్ధి చెందుతుందని, ఉద్యోగులకు అందించాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ఉండాలని, వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని ఉద్యోగులకు తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు నిల్వ ఉంచుకొని ఉద్యోగులకు అందిస్తూ ఉండాలని తెలిపారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సర ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడానికి తీసుకోవాల్సిన అన్ని ప్రణాళికలను సిద్ధం చేసుకొని ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం వి పురుషోత్తమ రెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఉపరితల గనుల ప్రాజెక్టు ఆఫీసర్లు ఎం శ్రీనివాస్, టి.శ్రీనివాస్, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, శ్రీరాంపూర్ ఏరియా ఏజెంట్లు గోపాల్ సింగ్, రాముడు, డీజీఎం పర్సనల్ పి అరవింద రావు,డీజీఎం ఐఈడి చిరంజీవులు, డీవై సీఎంఓ డా. రమేష్ బాబు, గనుల విభాగాల అధిపతులు, గనుల మేనేజర్లు, గ్రూప్ ఇంజనీర్లు, సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

జోరుగా కాంగ్రెస్ ప్రచారం



నవతెలంగాణ-తలమడుగు

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ ప్రచారం ఊపందుకుంది. గురువారం మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గిరిజన నాయకులైన చెడ్మకి వెంకట్, గేడం ఆనందరావు తదితర నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, జెడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి వీరు పార్టీలో చేరారు. ఎన్నికల ప్రచారంలో ప్రకాష్‌రావు, బొల్లారం బాబన్న, రాజేశ్వర్, జంగుపటేల్, రాజేశ్వర్, ఆనంద్‌రావు, దేవాపూర్ మాజీ సర్పంచ్ తిరుపతి, యూత్ కాంగ్రెస్ నాయకుడు ఆడే సతీష్, పోశెట్టి పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని వెంకటపూర్ గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణ తల్లి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి కారణాలు తెలుసుకొని ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవిరెడ్డి, సద్దాం హుస్సేన్, ప్రతాప్ సింగ్ ఉన్నారు.

ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ

నవతెలంగాణ-వర్ని

మండల కేంద్రంలో ఎస్ఎస్‌పురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తాజా మాజీ సర్పంచ్ నెమని నాగమణి విరాజ్ కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో భాగంగా ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ, అరటి పండ్లను పంపిణీ చేశారు. అనంతరం కూలీలతో పిసిసి డెలిగేట్ డాక్టర్ కూనీపూర్ రాజారెడ్డి, ఎంపీపీ మేక లక్ష్మీ వీర్రాజు మాట్లాడుతూ.. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కర్‌కు చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఉచిత బస్సు ఫ్రీ, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, రూ.500కే సిలిండర్ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. ఎన్నికల కోడ్ తర్వాత ఇందిరమ్మ ఇండ్లు, రెండు లక్షల రుణమాఫీ, 2500 రూపాయలు మహిళలకు నెలకు ఇస్తుందని తెలిపారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయిన తర్వాత ప్రతి నిరుపేద కుటుంబానికి సంవత్సరానికి లక్ష రూపాయలు ఖాతాలో జమ చేస్తుందని, ఇలా అన్ని పథకాలు అమలు కావాలంటే కాంగ్రెస్ పార్టీని ఆదరించి చేతి గుర్తుకు ఓటు వేయాలని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఉందని దీనికి తోడు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు మోయిన్, డిసిసి డెలిగేట్ గంగాప్రసాద్, రాష్ట్ర మైనార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ భారీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి హర్ష, ఉపాధ్యక్షుడు శ్రీను, దామినేని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సమర్థవంతంగా నిర్వహించాలి

- జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కీర్తి రాజ్‌వీరు



మాట్లాడుతున్న జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కీర్తి రాజ్‌వీరు

నవతెలంగాణ-నస్పూర్

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కీర్తి రాజ్‌వీరు అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా యువజన క్రీడా శాఖ కార్యాలయంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల శిక్షకులతో సమావేశం ఏర్పాటు చేసి శిక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. శిబిరాలలో పిల్లలకు తాగునీటి వసతి కల్పించాలని తెలిపారు. వేసవి ఉష్ణోగ్రత అధికంగా ఉన్నందున ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, అవసరమైతే వైద్య సిబ్బందిని సంప్రదించాలని, క్రీడా ప్రదేశంలో అన్ని వసతులు ఏర్పాటు చేసి శిక్షణ అందించాలని సూచించారు. ఈ నెల 31వ తేదీ వరకు ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు శిబిరం నిర్వహించాలన్నారు. శిక్షణకు హాజరయ్యే పిల్లల సంరక్షణ బాధ్యతగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు పాల్గొన్నారు.

సమన్యాయం కావాలంటే.. కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి

నవతెలంగాణ-రెంజల్

భారత దేశంలో బడుగు బలహీన వర్గాల సమన్యాయం కావాలంటే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబిన్ ఖాన్ స్పష్టం చేశారు. గురువారం మండలంలోని దూపల్లి, దండిగుట్ట గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల వద్ద ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 6 గ్యారంటీ పథకాలతో ప్రజలకు మరింత చేరువలోకి తీసుకువస్తుందని ఆయన అన్నారు. నేడు ఉపాధి హామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందని ఆయన విమర్శించారు. బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు పెద్దపీటవేస్తూ బడుగు బలహీన వర్గాలకు అణగదొక్కే ప్రయత్నం చేస్తుందని ఆయన అన్నారు. రాబోవు కాలంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉపాధి హామీ కూలీలకు రోజుకి రూ.400 వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే తూచా తప్పకుండా ప్రభుత్వం ప్రకటించిన గ్యారెంటీ పథకాలను అమలు పరిచే విధంగా ముందుకు సాగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ధనుంజయ్, నాగభూషణం రెడ్డి, జి.సాయిరెడ్డి, సురేందర్‌గౌడ్, జావీద్ ఉద్దీన్, సిహెచ్.రాములు, మోహన్, సాయిబాబాగౌడ్, ఓ.మోహన్, వేణు, సగ్గు వెంకటి, కొజ్జా భూమన్న, శంషొద్దీన్, సిద్ధ సాయిలు, గైనిక్ కిరణ్, ఎల్.కృష్ణ, గంగాధర్, సురేష్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

నవతెలంగాణ-జన్నారం



కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి, ఆత్రం సుగుణ తరపున పార్టీ శ్రేణులు ప్రచారం చేపట్టారు. మండల కేంద్రంలో కటింగ్ షాప్‌కు వెళ్లి హెయిర్ కటింగ్ చేస్తూ ఓట్లను అడిగారు. అనంతరం ప్రధాన రహదారిపై ఉన్న చిరు వ్యాపారుల వద్ద బజ్జీలు బోండాలు వేస్తూ ఓటర్లను ప్రసన్నం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ రెండు కాలం చెల్లిన పార్టీలని అన్నారు. రంగాల్లో అభివృద్ధి చెందాలన్న, ప్రజలకు న్యాయం జరగాలన్న కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఫసివుల్లా, ఎంపీటీసీ రియాజ్, పట్టణ అధ్యక్షుడు దుమాల రమేష్, బీసీసెల్ మండల అధ్యక్షుడు రాజన్న యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మామిడిపల్లి ఇందయ్యా, మండల మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, వార్డ్ మెంబర్ గంగన్న యాదవ్, మండల మైనార్టీ నాయకులు సయ్యద్ రఫీ ఉల్లా, వసీం పటేల్, ఎంఏ రజాక్, రియాసత్ అలీ, మౌలా బకాష్, సీనియర్ నాయకులు నర్సింగ రావు, మంత్రి లచ్చన్న, గాబ్రియల్, యువజన కాంగ్రెస్ నాయకులు గోపి పవన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వరంపల్లి గ్రామంలో మాజీ వార్డ్ మెంబర్ బలరాం భార్య బాలమణి ఐదురోజుల క్రితం మరణించారు. విషయం తెలుసుకున్న గ్రామ ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రాజు, గ్రామస్తులు అనిల్, రాజు, రామాంజనేయులు, ప్రవీణ్, ప్రమోద్, సురేష్, స్వామి తదితరులున్నారు.